## లంచంపై సుప్రీం తీర్పు

లంచం తీసుకొని చట్టసభల్లో ఓటు వేయడం లేదా లంచం తీసుకొని మాట్లాడటం చేస్తే దాని నుంచి ఎలాంటి మినహాయింపు ఉండదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆర్టికల్ 105 ప్రకారం పార్లమెంట్ సభ్యులకు, ఆర్టికల్ 194 ప్రకారం శాసన సభ, మండలి సభ్యులకు కొన్ని మినహాయింపులు ఉంటాయి. ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తాజా తీర్పుతో మరి కొంత స్పష్టత ఇచ్చింది. లంచం తీసుకొని మాట్లాడినా లేదా లంచం తీసుకొని ఓటు వేసినా రాజ్యాంగ మినహాయింపులు వర్తించవని పేర్కొంది. ఈ కేసులో తీర్పు చెప్పిన న్యాయమూర్తులు- జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ నరసింహా, జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా.



# అడ్డంకులు అధిగమించి..

చిన్న చిన్న విజయాలు సాధిస్తేనే ఎంతో సంబరపడుతుంటాం. అదే జీవితాన్ని మలుపు తిప్పే గెలుపైతే.. ఆ అచీవ్‌మెంట్‌లో ఉన్న ఆనందమే వేరు. అదే చేసి చూపించారు కొందరు అభ్యర్థులు. పెండ్లి అయ్యి పిల్లలున్నప్పటికీ ఉద్యోగ సాధనలో అవేవీ వారికి అడ్డు కాలేదు. ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగైదు గురుకుల కొలువులను కొల్లగొట్టి ఔరా అనిపించారు. పేదరికాన్ని దాటి గెలిచిన వారు కొందరైతే, కుటుంబ బాధ్యతలను మోస్తూ విజయాన్ని దక్కించుకుని ఆదర్శంగా నిలిచినవారు ఇంకొందరు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గురుకుల టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ పరీక్షల్లో విజయం సాధించి ప్రస్తుత ప్రభుత్వంలో నియామక పత్రాలు అందుకున్న వారి గెలుపు ప్రస్థానం వారి మాటల్లో..



సురేందర్ బండారు

## సెల్ఫ్ ప్రిపరేషన్‌తోనే..

**కుటుంబ నేపథ్యం ఏంటి?**

మాది నల్లగొండ జిల్లా, మాడ్గులపల్లి మండలం, మర్రిగూడ గ్రామం. డిగ్రీ, బీఈడీ మిర్యాలగూడలో, ఎమ్మెస్సీ ఫిజిక్స్ హైదరాబాద్‌లో పూర్తి చేశాను. నా భర్త సినిమాటోగ్రఫీ చేస్తారు. ఇద్దరు పిల్లలు.

**ప్రిపరేషన్ ప్రణాళిక ఏంటి? ఎన్ని ఉద్యోగాలు సాధించారు?**

- రోజూ 10-12 గంటలు పుస్తకాలతో గడిపాను. 2018 నుంచి ప్రిపరేషన్ ఆపలేదు. ఎల్లప్పుడూ సబ్జెక్టులతో టచ్‌లోనే ఉన్నాను. తెలుగు అకాడమీ, స్కూల్ బుక్స్ ఫాలో అయ్యాను. సబ్జెక్టు చదివేటప్పుడే నోట్సు రాసుకోవడం నాకు అలవాటు. అలా చేయడం వల్ల 20 శాతం అప్పుడే గుర్తుండిపోతుంది. ఏదైనా సరే విశ్లేషించుకున్న తర్వాతనే ముందడుగు వేస్తాను. టీజీటీ, పీజీటీ ఫిజికల్ సైన్స్, జేఎల్ ఫిజిక్స్‌కు ఎంపికయ్యాను. పీజీటీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు, టీజీటీ స్టేట్ థర్డ్ ర్యాంకు వచ్చింది. జేఎల్ ఫిజిక్స్ మెథడ్‌లో 81.25, కంటెంట్‌లో 60 మార్కులు సాధించాను. ప్రస్తుతం పీజీటీ అపాయింట్‌మెంట్ లెటర్ అందుకున్నాను. ఎలక్షన్ కోడ్ వల్ల జేఎల్‌కు ఇంకా ఇవ్వలేదు. దాని కోసమే ఎదురుచూస్తున్నాను. వీటికంటే ముందు కేజీబీవీలో రెండు ఉద్యోగాల్లో డిస్ట్రిక్ట్ ఫస్ట్ ర్యాంకులు సాధించాను.

**ఎవరి వల్ల స్ఫూర్తి పొందారు?**

- సివిల్స్ ఫ్యాకల్టీ బాలలత మోటివేషనల్ వీడియోలు చూసి స్ఫూర్తి పొందాను. ఆమె జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమే. ఎంత నిరాశలో ఉన్నా సులువుగా బయటికి రావొచ్చు.



దేవిరెడ్డి శారద

**ఇద్దరు పిల్లలు పుట్టాక ఉద్యోగాలు సాధించడంపై ఎలా అనిపిస్తుంది?**

- చాలా సంతోషంగా ఉంది. 2018లో మెథడ్ వల్ల గురుకుల జాబ్ చేజారింది. కష్టపడి ఉద్యోగం సాధించాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. సెల్ఫ్ ప్రిపరేషన్‌నే ఎక్కువ నమ్ముతాను.

**మీ భర్త సినిమాటోగ్రఫీ ఫీల్డ్ కదా, మీకెలా సపోర్ట్ చేశారు?**

- ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. భర్త, అమ్మానాన్నల సపోర్ట్ వల్లే ఇంతదూరం రాగలిగాను. రీడింగ్ రూమ్‌లో ఉండి చదువుకోవడంలో వారి సహకారానికి విలువ కట్టలేను. ఎల్లప్పుడు రుణపడి ఉండటమే వారికి నేనిచ్చే అసలైన బహుమతి.

**పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేవారికి మీ సూచనలు?**

- నోటిఫికేషన్ల కోసం ఎదురు చూడొద్దు. అది ఎప్పుడొచ్చినా 'నాకో ఉద్యోగం ఉండాలి' అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రిపరేషన్ కొనసాగించాలి. చదివిన సబ్జెక్టును స్నేహితులతో చర్చించుకోవాలి. నెగెటివ్ మార్కింగ్ వల్ల భయపడి పరీక్షలో తప్పులు చేయొద్దు. తెలిసినవి సరిగా ఆన్సర్ చేయాలి. అప్పుడే విజయం మనదవుతుంది.

## తల్లిదండ్రుల కష్టమే నేను..

**మీ కుటుంబ నేపథ్యం?**

- సిద్దిపేట జిల్లా, దౌల్తాబాద్ మండలం, శౌరీపూర్ మా స్వగ్రామం. అమ్మ బగులవ్వ, నాన్న కిష్టయ్య వ్యవసాయదారులు. నాన్న కాలం చేశాడు. వారిద్దరి కష్టమే నేను. నా చదువంతా ప్రభుత్వ విద్యే. 6వ తరగతి నుంచి డిగ్రీ వరకు సిద్దిపేటలో చదివాను. బీఈడీ నాగార్జునసాగర్ ప్రభుత్వ కాలేజీ, కేయూ నుంచి తెలుగు పూర్తి చేశాను.

**రోజూ ఎన్ని గంటలు, ఏయే మెటీరియల్ చదివారు?**

- రోజూ 10-12 గంటలు చదివాను. సంవత్సరం పాటు ప్రిపేరయ్యాను. డీఎస్సీ కోచింగ్ గురుకులకు ఉపయోగపడింది. అకడమిక్ టెక్ట్స్ బుక్స్ ఫాలో అయ్యాను. తెలుగు అకాడమీ నుంచి మెథడ్ చదివాను. స్నేహితులు శ్రీకాంత్, శ్రీనివాస్ (వరంగల్, హనుమకొండ) ముగ్గురం కలిసి ప్రిపేరయ్యాం. చదివిన సబ్జెక్టులపై రోజూ సాయంత్రం గంటసేపు బృంద చర్చ నిర్వహించుకున్నాం. ఫలితంగా కంటెంట్‌లో 76, మెథడ్‌లో వచ్చిన 69 మార్కులు ఉద్యోగం రావడంలో చాలా ప్లస్ అయ్యాయి. టీజీటీ గురుకుల తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. డెమోలో జేఎల్ మిస్సయింది.



చెన్న రాజు

**పోటీ ప్రపంచంలో ఉద్యోగం సాధించడంపై ఎలా అనిపిస్తుంది?**

- నాకు కొత్త జీవితాన్నిచ్చిందనే చెప్పాలి. నా సతీమణి అనిత సహకారాన్ని మాటల్లో చెప్పలేను. నాకు ఇద్దరు పిల్లలు (బాబుకు 3 ఏండ్లు, పాపకు ఏడాది). వారికి దూరంగా ఉన్న బాధ కంటే వారి భవిష్యత్తే ముఖ్యమనుకున్నాను. సమస్యలను చిన్న చూపు చూడటం చిన్నప్పటి నుంచి నాకు అలవాటే. కష్టాన్ని నమ్ముకున్నాను. అందుకే ఈ విజయం నాకు అండగా నిలబడింది.

**ఉద్యోగ సాధనలో స్ఫూర్తి ఎవరు?**

- చిన్నప్పటి నుంచి నాకు ఒక మెంటర్‌గా, గురువుగా ఉండి నన్ను తీర్చిదిద్దిన వ్యక్తి హుస్సేన్ సార్. పేదలకు చదువే అసలైన ఆస్తి అని వెన్ను తట్టి ప్రోత్సహించారు. ఆయన రుణం తీర్చుకోలేనిది.

**ఒత్తిడిని ఎలా అధిగమించారు?**

- వార్త పత్రికలు, పుస్తకాలు చదవడం, పిల్లల ఫొటోలు చూస్తూ రిలాక్స్ అయ్యేవాడిని. యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతను పొందాను. పరీక్షకు ముందు ఆరు నెలల పాటు ఉదయం బాలామృతం, రాత్రి బిట్‌రూట్, క్యారెట్ తిని ఆకలి తీర్చుకున్నాను. నా కష్టానికి ప్రతిఫలం దక్కినందుకు సంతోషంగా ఉంది.

**పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే వారికి మీ సలహాలు, సూచనలు?**

- ఏ సబ్జెక్టు అయినా పర్‌ఫెక్ట్‌గా చదవాలి. రివిజన్, ప్రాక్టీస్ టెస్టులు రాయడంలోనే సక్సెస్ దాగి ఉంది. ఇష్టంతో చదివితే ఏ సబ్జెక్టు అయినా కష్టం అనిపించదు.